'జనరిక్'కు అందని ఊతం

- ప్రిస్కిప్షన్‌కు వెనుకాడుతున్న వైద్యులు
- అందుబాటులో లేని దుకాణాలు
- చౌక మందులకు నోచుకోని ఆదివాసీలు
- అవగాహన, చర్యల్లో ప్రభుత్వం విఫలం



భద్రాచలం పట్టణంలోని జనరిక్ స్టోర్.

భద్రాచలంఅర్బన్: వివిధ వ్యాధులకు మాత్రలు అందించే కంపెనీలు ఇష్టారాజ్యంగా ధరలను నిర్ణయించడం, వాటిని పేదలు కొనుగోలు చేయలేకపోవడం పరిపాటిగా మారింది. ఈ పరిణామాలకు స్వస్తి పలికేందుకు కేంద్ర ప్రభుత్వం తక్కువ ధరలకు జనరిక్ మందులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రతి వైద్యుడూ ఈ జనరిక్ మందులను ప్రిస్కిప్షన్లలో రాయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మందుల దుకాణాలను విరివిగా ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు ఇచ్చింది. కానీ, క్షేత్రస్థాయిలో ఆ ఆదేశాలు అమలు కావడం లేదు.

బ్రాండెడ్ మందుల్లో వాడే ఔషధాన్నే జనరిక్‌లో వాడుతారు. కానీ వీటిపై ఔషధ మూలకం పేరు తప్పా బ్రాండెడ్ లాగా ఆకర్షణీయ పేరులు ఉండవు. దీంతోపాటు బ్రాండెడ్ మందులతో పోలిస్తే.. అదే మూలకం ఉన్న జనరిక్ మందులు 40 నుంచి 90శాతం తక్కువకు ధరకే లభిస్తాయి. ఉదాహరణకు జ్వరానికి వాడే పారాసిటమాల్ సాధారణ మందుల షాపుల్లో రూ.10 నుంచి 15 వరకు పడుతుంటే జనరిక్ షాపుల్లో రూ.4.51కే లభిస్తోంది.

ప్రిస్క్రిప్షన్‌లో కనిపించని జనరిక్..

జనరిక్ మందులు పేదలకు అందుబాటు ధరల్లో లభిస్తున్నప్పటికీ.. వైద్యులు వీటిని ప్రిస్కిప్షన్లతో రాయడం లేదు. భద్రాచలం పట్టణంలోని మెజారిటీ వైద్యశాలల్లో ఈ తీరు కనిపిస్తోంది. బ్రాండెడ్ కంపెనీలు తమ మందులను ప్రిస్కిప్షన్‌లో రాస్తే నజరానా, విలువైన వస్తువులు అందించడం, విదేశీ పర్యటనలకు తీసుకెళ్లడం వంటి ఆకర్షణీయ పథకాలను ప్రదర్శిస్తున్నాయి. దీంతో కొందరు వైద్యులు వాటికి లొంగి జనరిక్‌ను పక్కనబెడుతున్నారు. దీంతోపాటు వైద్యులందరికీ దాదాపుగా సొంత మెడికల్ దుకాణాలు ఉండటంతో ఎక్కువ లాభాలనిచ్చే బ్రాండెడ్ మందులనే వ్యాధి బాధితులకు అంటగడుతున్నారు. తప్పనిసరిగా జనరిక్ మందులు రాయాలనే నిబంధనను వైద్యులు ఉల్లంఘిస్తున్నప్పటికీ.. అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు.

భద్రాచలంలో ఒకే ఒక్క దుకాణం

జనరిక్ దుకాణాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నప్పటికీ.. వాటిని నెలకొల్పేందుకు ముందుకు వచ్చేవారు లేరు. భద్రాచలం పట్టణంలో రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓ దుకాణం మాత్రమే ఉండడం ఇందుకు నిదర్శనం. ఈ మందులపై ప్రజల్లో ముఖ్యంగా ఏజెన్సీ ఆదివాసీల్లో అవగాహన లేకపోవడం, కొద్దోగొప్పో అమ్ముడుపోయే మందుల వల్ల కూడా లాభాలు రాకపోవడంతో దుకాణాలు నెలకోల్పేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఈ పరిస్థితి జనరిక్ ఔషధ స్టోర్లలోనూ కనపిస్తోంది. వీటిల్లో లాభాల కోసం బ్రాండెడ్ మందులు సైతం అమ్ముతున్నట్లు, అన్ని రకాల జనరిక్‌లు అందుబాటులో ఉంచడాన్ని మరిచినట్లు సమాచారం. వైద్యులు జనరిక్ మందులను ప్రిస్కిప్షన్ రాసేవిధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జనరిక్ మందులతో పేద వారికి మేలు



జనరిక్ మందుల అమ్మకాల పై ప్రజల్లో ఉన్న అపోహలను పాగోట్టాలి. ఇంగ్లీష్ మందులతో పోలిస్తే జనరిక్ మందుల వల్ల ఆర్థికంగా ఎంతో ఉపయోగకరం. పేద కుటుంబాలకు సంబంధించి అనారోగ్యం బారిన పడినప్పుడు ఇలాంటి దుకాణల ద్వారా జరిగే మేలు చెప్పలేనిది.

– దేశప్ప, భద్రాచలం

అవగాహన పెంచేందుకు చర్యలు



భద్రాచలం పరిసర ప్రాంతాల్లో గిరిజనుల సంఖ్య అధికంగా ఉంటుంది. వీరికి తక్కువ ధరలకే మందులు దొరికే విధంగా చర్యలు తీసుకుంటాం. రానున్న రోజుల్లో ప్రజలకు జనరిక్‌పై అవగాహన కార్యక్రమాలు మరింతగా నిర్వహిస్తాం. దుకాణాల సంఖ్యను కూడా పెంచేందుకు కృషి చేస్తాం.

– సంపత్, ఔషధ నియంత్రణ అధికారి, భద్రాద్రి కొత్తగూడెం

క్లుప్తంగా

సుకన్య ఖాతాల ప్రత్యేక మేళా

దుమ్ముగూడెం: ఆడ బిడ్డల బంగారు భవిష్యత్ కోసం భారత తపాలా శాఖ విస్తృత స్థాయిలో సుకన్య సమృద్ధి ఖాతాలు ప్రారంభిస్తోందని భద్రాచలం పోస్టల్ ఏఎస్పీ సుచేందర్ అన్నారు. సోమవారం దుమ్ముగూడెం పోస్ట్ ఆఫీస్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. అమృత్ పక్స్ 2023 సందర్భంగా ఈ నెల 9,10 తేదీల్లో అన్ని పోస్ట్ ఆఫీసుల్లో సుకన్య ఖాతాల ప్రత్యేక మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. సుకన్య ఖాతా కనీసం 250 రూపాయలతో నెలవారీగా కట్టవచ్చని, పుట్టిన ఆడ పిల్లలు నుంచి 10 సంవత్సరాల లోపు పిల్లలకు పథకం వర్తిస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో దుమ్ముగూడెం ఎస్పీఎంఎస్ వి.రావు, మెయిల్ వర్సెస్ ఆనంద గోపాల్, దుర్గాప్రసాద్, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు, ఏబీపీఎం లు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతలు స్వీకరణ


తహసీల్దార్ చల్ల ప్రసాద్..

పినపాక: మండల తహసీల్దార్‌గా చల్ల ప్రసాద్ సోమవారం తమ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఉషా శారద ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఉండగా ఇటీవల బదిలీల్లో భాగంగా చల్ల ప్రసాద్‌ను పినపాకకు కేటాయించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

సమ్మక్క-సారలమ్మలను దర్శించుకున్న సత్యవతి

చర్ల: బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి సోమవారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్నారు. చర్ల మండల పర్యటనకు వచ్చిన ఆమె.. స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసివెళ్లి సుబ్బంపేట పంచాయతీ పరిధిలో ఎదిర గుట్టల వద్ద ఉన్న సమ్మక్క సారలమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట పార్టీ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ బిట్రగుంట క్రాంతికుమార్, స్థానిక నాయకులు ఉన్నారు.

ధర్మ పరిరక్షణకు బిక్షాటన

దుమ్ముగూడెం: మండల పరిధిలోని కొత్తదుమ్ముగూడెం గ్రామంలో డాక్టర్ కృష్ణ చైతన్య స్వామి సూచన మేరకు శ్రీ నృసింహ సేవా వాహిని ఆధ్వర్యంలో నృసింహ దీక్షాపరులు ఇంటింటికీ వెళ్లి సోమవారం బిక్షాటన చేపట్టారు.ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు కృష్ణ చైతన్య స్వామి మాట్లాడుతూ.. ధర్మానికి దూరమైన వారిని ఐక్యం చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో నృసింహ దీక్షాపరులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'హాథ్ సే హాథ్ జోడో' ప్రారంభం


కరపత్రాలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

దమ్మపేట: హాథ్ సే హాథ్ జోడో యాత్రను సోమవారం దమ్మపేట మండల పరిధిలోని నాచారం గ్రామంలో టీపీసీసీ మెంబర్, ములకలపల్లి జెడ్పీటీసీ సున్నం నాగమణి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నాచారం గ్రామంలోని ప్రతి గడపకు తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మద్దిశెట్టి సత్యప్రసాద్, షూకూర్, చీకటి శ్రీను పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న గ్రామస్తులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని అంకమ్మ తల్లి ఆలయ హుండీలో 3 రోజులు నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠ సందర్భంగా జమ అయిన ఆదాయాన్ని గ్రామస్తుల సమక్షంలో సోమవారం లెక్కించారు. రూ.1.84 లక్షలు వచ్చినట్లు హరిహర ఫౌండేషన్ వ్యవస్థాపకులు, శివాలయ పునఃనిర్మాణకర్త మారగాని శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పానుగంటి రాఘవులు, ఇనపనూరి రాంబాబు, చల్లా రమేష్, చిట్టిబొమ్మల కోటేశ్వరరావు, చల్లా పెద్దలక్ష్మణ్‌రావు, పర్స రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి


సమావేశంలో మాట్లాడుతున్న జంపన సీతారామరాజు

మణుగూరురటౌన్: కేసీఆర్ కుటుంబ పాలనకు తెలంగాణ ప్రజలు చరమగీతం పాడాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంపన సీతారామరాజు అన్నారు. సోమవారం మణుగూరు మండల కేంద్రంలో ఏర్పాటు మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేసీఆర్ కుటుంబ పాలతో తెలంగాణ రాష్ట్రం దయనీయస్థితికి వస్తుందన్నారు. ప్రతీ శక్తి కేంద్రాల్లో 10వ తేదీ నుంచి 25వ తేదీ వరకు కార్నర్ సమావేశాలు ఏర్పాటు చేసి.. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. పినపాక నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి గెలుపుకోసం పాటుపడాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మణుగూరు మండల అధ్యక్షుడు కుంజా రామకృష్ణ, కొండి ప్రభాకర్, వార్డు సభ్యుడు మునిగెల సుజాత, కె.లక్ష్మీదేవి, మండల ప్రధాన కార్యదర్శి పల్లపు కిషోర్ బాబు, ఇమ్మడి నాగేషు, జి. వెంకటేశ్వర్లు, అబ్బులు, ఎంఎం రాజులు పాల్గొన్నారు.

సమ్మేళనానికి తరలిన నాయకులు

చండ్రుగొండ: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం దమ్మపేట మండలంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి బీఆర్ఎస్ స్థానిక ముఖ్య నాయకులు తరలివెళ్లారు. బీఆర్ఎస్‌పార్టీ మాజీ మండల అధ్యక్షుడు మాళోత్ భోజ్యానాయక్ ఆధ్వర్యంలో ఎంపీపీ బాణోత్ పార్వతి, వైఎస్ ఎంపీపీ నరుకుళ్ల సత్యనారాయణ, రైతుబంధు జిల్లా సమన్వయకర్త అంకిరెడ్డి కృష్ణారెడ్డి, మంగయ్యబంజర్, పోకలగూడెం, వెంకటియాతండా, దామరచర్ల సర్పంచ్‌లు సునిత, నిరోషా, బాలాజీ, లక్ష్మీపతి, దామరచర్ల ఎంపీటీసీ వెంకటకుమారిల ఆధ్వర్యంలో సుమారు 500 మంది నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తరలివెళ్లారు. కార్లు, ఆటోల్లో ప్రయాణమయ్యారు. మొదట ర్యాలీ నిర్వహించారు.

లింగమంతుల జాతరలో పాయం పూజలు


స్వామి వారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరురూరల్: మణుగూరు, అశ్వాపురం మండలాల సరిహద్దు ప్రాంతంలో రేగులగండి అటవీ క్షేత్రంలో వేంచేసియున్న శ్రీభవాని లింగమంతుల జాతర వైభవంగా జరుగుతోంది. ఈ జాతరలో పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని భవాని సమేత లింగమంతుల స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర నిర్వహణ కమిటీ వారు ఆయనకు స్వాగతం పలకడంతో పాటు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కనకయ్య, టీవీ సుబ్బారెడ్డి, రెడ్డి బోయిన సైదులు, మల్లికార్జున్, జీవరత్నం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. జాతరలో మండల ప్రజాప్రతినిధులైన మణుగూరు జెడ్పీటిసి పోశం నర్సింహారావు, సర్పంచ్‌లు బచ్చల భారతి, కొమరం జంపేశ్వరి, ఏనిక ప్రసాద్, తాటి రామకృష్ణ, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావులతో పాటు అశ్వాపురం నుంచి జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, వైస్ఎంపీపీ కె.వీరభద్రం, సర్పంచ్ కోడి కృష్ణవేణి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్‌లు పాల్గొని స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

అటెన్షన్ ప్లీజ్



వెలగని వీధిలైట్లు



మణుగూరులోని సమితిసింగారంలో అభివృద్ధి పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన వీధిదీపాలు సరిగ్గా వెలగడం లేదు. దీంతో ద్విచక్రదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. సంబంధిత సర్పంచ్ స్పందించి సమస్యలను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

– మణుగూరురూరల్

ప్రశ్నించాల్సిన అధికారి: బచ్చల భారతి, సర్పంచ్, సమితిసింగారం
ఫోన్ నంబర్: 9502630566

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ఈ నెల 7న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ మైథిలి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల్లో భాగంగా భద్రాచలం పట్టణం మొత్తం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆమె కోరారు.

బూత్ స్థాయి సమావేశం

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని 116వ బూత్ స్థాయి బీఆర్ఎస్ సమావేశాన్ని సోమవారం నిర్వహించగా.. పార్టీ నాయకులు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ బోయిళ్ల రమణయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి అందిస్తున్న సంక్షేమ పథకాలను, చేస్తున్న అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో పాడుతూరి విక్రమ్, చందా నాగేశ్వరరావు, కురం సతీష్, లక్ష్మీనారాయణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామ శివారులో అటవీ ప్రాంతంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడుకి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అశ్వాపురం పోలీసులు తీవ్ర గాయాలతో రహదారిపై పడి ఉన్న యువకుడిని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వైద్యానికి ఆర్థిక సాయం

చర్ల: మండలంలోని గొమ్ముగూడెం గ్రామపంచాయతీలోని గాంధీనగర్‌కు చెందిన నిరుపేద సాధనపల్లి రవి అనారోగ్యంతో బాధపడుతుండగా.. వైద్య ఖర్చుల కోసం మేమున్నాం సహాయ కమిటీ సభ్యులు రూ.15,500 నగదును సమీకరించి సోమవారం బాధితుడికి అందజేశారు. తమ అభ్యర్థన మేరకు భద్రాచలంలోని డాక్టర్ గూడూరి సుదర్శన్ బాధితుడి కుటుంబానికి రూ.25 వేల నగదును అందజేయడంతో పాటు కాలుకు ఆపరేషన్‌ను ఉచితంగా చేసేందుకు ముందుకు వచ్చారని సంస్థ ప్రతినిధులు నీలి ప్రకాశ్, శెట్టి సాంబశివరావు, చింతా నాగబాబు తెలిపారు. కార్యక్రమంలో దొడ్డి తాతారావు, తాండవ రాయుడు, సొల్లంగి నాగేశ్వరావు, బండారి భరణి కుమార్, ఇర్పవడ్ల రాము, దొడ్డా ప్రభుదాసు, కవ్వాల రాము తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు మర్లపాటి రేణుకు అన్నారు. పట్టణంలో ఎస్ఆర్ఎస్ కాలనీ, భగవాన్‌దాస్ కాలనీ, వైయస్ఆర్ నగర్ కాలనీల్లో సోమవారం సీపీఎం బృందం సమస్యలపై సర్వే నిర్వహించారు. డ్రైనేజీ వంటి పలు సమస్యలు పాలకవర్గం లేకపోవడంతో పేరుకుపోయాయని, అధికారులకు విన్నవించినప్పటికీ పరిష్కరించడం లేదని స్థానికులు వారి బృందం దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యుడు కొరడ శ్రీనివాస్, ఏ.సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

ముత్తంగి అలంకరణలో రామయ్య


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలోని మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామి వారిని ముత్తంగి రూపంలో అలంకరించటం ప్రత్యేకత. అదేవిధంగా సహస్ర కలశాభిషేకం సందర్భంగా నిలిపివేసిన నిత్యకల్యాణాలు సోమవారం పునఃప్రారంభమయ్యాయి. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

బడ్జెట్‌పై భగ్గుమన్న పార్టీలు



గుండాలలో నిరసన తెలియజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

గుండాల: అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం గుండాల మండల కేంద్రంలో బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు డి.ప్రణయ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ.. అసెంబ్లీలో విద్యారంగానికి 6.57 శాతం మాత్రమే బడ్జెట్ కేటాయించారని విమర్శించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రణదీప్, నాయకులు శ్రీరామ్, రాకేష్, కార్తీక్, శ్రీనాథ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం

బూర్గంపాడు: రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీఎస్పీ జిల్లా కార్యదర్శి కేవీ రమణ ఆరోపించారు. సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో రాష్ట్రంలో 52 శాతం మంది బీసీలుంటే వారికి కేవలం రూ.6,229 కోట్ల మాత్రమే కేటాయించటం దారుణమని తెలిపారు. దళితబంధును ఎరగా చూపించి షెడ్యూల్ కులాల సమగ్ర సంక్షేమం కోసం రూపొందించిన ఎస్సీ సబ్ ప్లాన్ పథకాన్ని నిర్వీర్యం చేసిందని ఆరోపించారు.

విద్యారంగాన్ని 6 శాతమే..

భద్రాద్రి ఆశలపై నీళ్లు

భద్రాచలంటౌన్: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో భద్రాచలం సమస్యలను దారుణంగా విస్మరించారని సీపీఎం నియోజకవర్గ కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాయలంలో సోమవారం ఆయన మాట్లాడారు. భద్రాచలం నియోజకవర్గంలో వరదల నివారణకు వెయ్యి కోట్లు, అంతకముందు ఇచ్చిన 100 కోట్ల హామీని బడ్జెట్‌లో ప్రస్తావించలేదని, ఆయనకు చిత్తశుద్ధి లేకపోవడానికి ఇది నిదర్శనమని అన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి


మాట్లాడుతున్న ఆదివాసీ సేనా జిల్లా అధ్యక్షుడు ఎలకం రామకృష్ణ

చర్ల: మండలంలోని సుబ్బంపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న బీఎస్ రామయ్య నగర్ ఏర్పాటై 20 యేళ్లు కావస్తున్నప్పటికీ.. ఇక్కడి గిరిజనులకు ప్రభుత్వం కనీస సౌకర్యాలను కల్పించలేదని ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు ఎలకం రామకృష్ణ అన్నారు. సోమవారం బీఎస్ రామయ్య నగర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, అంతర్గత రహదార్లు నిర్మించాలని, లేదంటే తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాకా సూరిబాబు, కాక శాంతమూర్తి, రమేష్, మడకం దూలయ్య, ఎలగల తిరుమలు, కోరం గురవయ్య, కాకా చిట్టిబాబు, ఎలకం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

భద్రాచలంటౌన్: భాషా పండితులకు వ్యాయామ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రాజు అన్నారు. పట్టణంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వ ఉపాధ్యాయులను పదోన్నతి కల్పిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయకుండా న్యాయస్థానాలలో వివాదాలను సాకుగా చూపిస్తుందని ఆరోపించారు.

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా భాషా, వ్యాయామ ఉపాధ్యాయులకు ఉద్యోగున్నతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి.హరిలాల్, ఎం.రామాచారి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

అశ్వాపురం: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు గద్దల శివకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం మణుగూరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో క్యాంపు కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ.. పంచాయతీ పారిశుధ్య కార్మికులకు జీఓ నంబర్ 60 ప్రకారం రూ.15,600, కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ.19,500 వేతనం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అశ్వాపురం మండల పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు చిలకా రామచంద్రయ్య, నల్లగట్ల వెంకన్న, మణుగూరు మండల అధ్యక్షుడు రంగ, ఎం.రమేష్, పీ.వీరన్న, మణెమ్మ, సదానందం, సురేష్, శంకర్ పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీలు రద్దు చేయాలి


భద్రాచలంటౌన్: విద్యుత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు


దమ్మపేట: మందలపల్లి సబ్‌స్టేషన్ వద్ద ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

భద్రాచలంటౌన్: విద్యుత్ వినియోగదారులపై భారాన్ని తగ్గించి, ప్రజలను దోపిడీ చేసే ఏసీడీ చార్జీలను రద్దు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ఆకోజు సునీల్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని డివిజన్ విద్యుత్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించి డివిజనల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వేణుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బల్ల సాయికుమార్, మారెడ్డి శివాజీ, నరసింహులు, రమేష్, రాయుడు, రామలక్ష్మి, గణేష్, ప్రభు, రమేష్, అనిల్, చంటి పాల్గొన్నారు.

దమ్మపేట: విద్యుత్ శాఖ గృహ వినియోగదారులకు బిల్లుల్లో అదనంగా విధిస్తున్న ఏసీడీ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మందలపల్లి గ్రామంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగించి అక్కడ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు యార్లగడ్డ భాస్కరరావు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు దస్తగిరి, ధర్మ, జెజవాడ రాంబాబు, లక్ష్మీనారాయణ, జానీబేగం, నాగమణి పాల్గొన్నారు.

చర్ల: విద్యుత్‌శాఖ ప్రజల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్న ఏసీడీ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం చర్లలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి ప్రదర్శనగా బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు.. విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చేరుకుని ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. పార్టీ రాష్ట్ర సమితి నాయకులు కల్లూరి వెంకటేశ్వరావు, జిల్లా సమితి సభ్యులు అడ్డగర్ల తాతాజీ, మండల కార్యదర్శి నపా పోతయ్య, నాయకులు కొంగూరు రాము తదితరులు పాల్గొన్నారు.